రుద్రభూమికి మహర్దశ!

ఆ శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు లేఖ ఆఖరి మజిలీకి పడుతున్న ఇబ్బందులు తొలగనున్నాయి.త్వరలో పూర్తి స్థాయిలో వసతులు సమకూరనున్నాయి. శ్మశాన వాటిక రూపురేఖలు మారనున్నాయి. వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ ప్రత్యేక చొరవతో ఏకంగా రూ.1.60 కోట్లు మంజూరయ్యాయి. మాస్టర్‌ప్లాన్ కూడా సిద్ధం కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి గ్రీన్ సిగ్నల్
- రూ.1.60 కోట్లు మంజూరు
- మాస్టర్‌ప్లాన్ సిద్ధం



కోరమాండల్ వద్ద గల శ్మశానవాటిక

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం ప్రాంతంలోని కోరమాండల్ సంస్థ ఎదురుగా గల హిందూ శ్మశానవాటికను అభివృద్ధి చేయడానికి అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేశారు.ఏఏ వసతులు సమకూర్చాలో ప్లాన్‌లో స్పష్టంగా పొందుపరిచారు.

ఇదీ పరిస్థితి

గుల్లలపాలెం వద్ద సుమారు ఎకరా 60 సెంట్ల విస్తీర్ణంలో వందేళ్ల నుంచి శ్మశానవాటిక ఉంది. పారిశ్రామిక ప్రాంతం పరిధిలోని ఏడు వార్డుల్లో ఎవరు చనిపోయినా ఇక్కడే దహన సంస్కారాలు చేస్తుంటారు. అయితే ఇది పూర్తిగా శిథిలావస్థకు చేరింది. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేవు. మృతదేహాలను కాల్చే షెడ్లు శిథిలమయ్యాయి. దీంతో వర్షాలు కురిస్తే ఆఖరిమజిలీకి పడరాని పాట్లు పడుతున్నారు. దీంతో ఇక్కడ బీటీ,సీసీ రోడ్లు కూడ పిక్క తేలి అధ్వానంగా మారాయి. దీంతో వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ పలు మార్లు కౌన్సిల్‌లో ఈ అంశం పై ప్రస్తావించారు. అంతటితో ఆగకుండా నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారితో పాటు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌లకు శ్మశాన వాటిక పరిస్థితిని, ప్రాధాన్యాన్ని వివరించారు. దీంతో స్పందించిన వారు రూ. 1.60 కోట్లతో శ్మశాన వాటికలో వసతులు కల్పించేందుకు ఆమోదం తెలిపారు. ఏఏ పనులు చేపట్టాలో కూడా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. టెండర్లను పిలవడానికి సిద్ధమయ్యారు. రెండు మూడు వారాల్లో పనులు కూడా ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

కల్పించనున్న వసతులు ఇవీ

- శ్మశానం చుట్టూ పచ్చదం పెంపొందించేలా మొక్కలు నాటనున్నారు.
- మృతదేహాలతో వచ్చే వారికి వెయింటింగ్ హాల్
- శ్మశానం చుట్టూ విద్యుత్ హైఎల్‌ఈడీ లైట్లు
- మృతదేహాలకు దహన సంస్కారాలు చేసేందుకు షెడ్లు
- తాగునీటి వసతులు ఇక్కడ కల్పించనున్నారు.



శ్మశాన అభివృద్ధి పనుల మాస్టర్ ప్లాన్

కౌన్సిల్ సమావేశంలో సమస్యపై చర్చించా



వార్డు పరిధిలోని గుల్లలపాలెం వద్ద గల శ్మశానవాటిక పూర్తిగా శిథిలావస్థకు చేరింది.దీంతో అంత్యక్రియలు చేయడానికి పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పలు కౌన్సిల్ సమావేశాల్లో వార్డులో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులతో పాటు శ్మశాన వాటిక పరిస్థితిని వివరించారు.శ్మశాన వాటిక స్థితిని మేయర్తో పాటు జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లాను. వారు స్పందించి నిధులు మంజూరు చేశారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. –డాక్టర్ పి.వి.సురేష్, 60వ వార్డు కార్పొరేటర్

చాలా మంచి విషయం



గుల్లలపాలెం శ్మశానవాటిక లోపల పరిస్థితి చాలా అధ్వానంగా ఉండేది. మా ప్రాంతంలో ఎవరు చనిపోయినా అక్కడే అంత్యక్రియలు పూర్తి చేస్తాం. శ్మశానం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి భయంకరంగా ఉంది. షెడ్లు శిథిలావస్థకు చేరాయి. రోడ్లు అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు శ్మశాన వాటికి అభివృద్ధికి నోచుకుంటుందని తెలిసి చాలా సంతోషిస్తున్నాం. వార్డు కార్పొరేటర్ చొరవతో ఇది సాధ్యం అయింది.
– సర్వసిద్ధి పైడిబాబుయాదవ్, మల్కాపురం

ఇన్నాళ్లకు నిధులు మంజూరు



కొన్నేళ్ల నుంచి గుల్లలపాలెం వద్ద గల హిందూ శ్మశాన వాటికలో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం.శవ యాత్రతో లోపలకు అడుగు పెడితే ఒక్క క్షణం కూడా ఉండలేని పరిస్థితి. ఎప్పుడు ఈ శ్మశానవాటికకు మోక్షం కలుగుతుందో అని ఎదురు చూశాం. ఇన్నాళ్లకు అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని తెలిసి సంతోషిస్తున్నాం.
– బంక నాగేశ్వరరావు, మల్కాపురం

ఎన్నికల హామీలు అమలు చేయాలి



క్రాంతినగర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సింధియా: ప్రజా సమస్యల పరిష్కారానికే సీపీఎం ప్రజాపోరు కార్యక్రమాన్ని చేపట్టిందని సీపీఎం నాయకులు తెలిపారు.జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురం, దుర్గానగర్, 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. చింతల్లోవ సచివాలయాల వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో అధిక సంఖ్యలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ అధికారులకు వినతి పత్రాలను సమర్పించారు.

క్రాంతినగర్‌లో పాదయాత్ర

కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం క్రాంతినగర్‌లో పాదయాత్ర చేపట్టారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచమని చెప్పి, తాజాగా ట్రూఅప్ పేరుతో రూ. 20 వేల కోట్ల ప్రజలపై భారం వేయడం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెంటారావు, రామారావు, కృష్ణ, రమణ, సూరిబాబు, రాము, రాంబాబు, నరేష్, సురేష్, గోపాల్, ప్రసాద్, నీలయ్య, అప్పలనర్సమ్మ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ చేస్తే సైలెన్సర్లు పీకేస్తాం

- కుర్రకారు జోరుకు కళ్లెం వేస్తాం
- ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు
- మెకానిక్‌లకు అవగాహన సదస్సు



హాజరైన మెకానికల్‌లు



మాట్లాడుతున్న ఏసీపీ వాసుదేవరావు

విశాఖ విద్య: ప్రజలకు అసౌకర్యం కలిగించేలా సౌండ్ చేసే సైలెన్సర్లను ద్విచక్రవాహనాలకు వినియోగిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు అన్నారు. ట్రాఫిక్ జోన్–2 పరిధి కంచరపాలెం, ఎయిర్ పోర్టు, గోపాలపట్నం, పెందుర్తి ,గాజువాక, స్టీల్ ప్లాంట్ ,దువ్వాడ, హార్బర్, న్యూ పోర్ట్, మల్కాపురం, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోగల మోటార్ సైకిల్ మెకానిక్‌లకు మంగళవారం మాధవధార వుడా కాలనీ జీవీఎంసీ కమ్యూనిటీ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ద్విచక్రవాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు వాడడం వల్ల కలిగే శబ్ద కాలుష్యం ముప్పు ఉంటుందన్నారు. సౌండ్ వల్ల వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలకు జరుగుతున్న నష్టంపై అవగాహన కల్పించారు. ఎవరైనా మోటార్ సైకిల్‌కు ఒరిజినల్ సైలెన్సర్ బదులుగా సౌండ్ పొల్యూషన్ తెచ్చే మోడిఫైడ్ సైలెన్సర్ తెచ్చి మార్చమని కోరితే అటువంటి చర్యలకు మెకానికల్‌లు సహకరించవద్దని సూచించారు. విశాఖ నగరంలో ప్రశాంతమైన వాతావరణ కల్పించడానికి ప్రతీ ఒక్కరి సహకారం అవసరమన్నారు. దీన్ని ఎవరైనా అతిక్రమించే వాహన వినియోగదారులకు సహకరిస్తే వేసిన మెకానిక్‌లతో పాటు విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇది ముందస్తు హెచ్చరికలగా తీసుకోవాలన్నారు. పొల్యూషన్ రహిత నగరం కోసం తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా మెకానిక్‌లు అంతా ప్రతిజ్ఞ చేశారు. సదస్సులో ట్రాఫిక్ సీఐలు దాశరథి, శ్రీనివాస్, కోటేశ్వరరావు, వెంకట్రావు, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న మేయర్



గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న మేయర్,డిప్యూటీ మేయర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ కొత్తరోడ్డులో నిర్వహిస్తున్న గౌరీ పరమేశ్వర ఉత్సవాల్లో మంగళవారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసం గౌరీ పరమేశ్వరులకు ఎంతో ఇష్టమైన మాసమని, ఈ మాసంలో స్వామిని సేవిస్తే సకల పాపాలు తొలగిపోతాయన్నారు. స్వామి ఆశీస్సులు నగర ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్‌లను నిర్వాహకులు సత్కరించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

మల్కాపురం: ఇటీవల విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలందించిన పారిశుధ్య కార్మికులను మంగళవారం జీవీఎంసీ59వ వార్డు నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్ సన్మానించారు. కార్మికులు తమ పరిధిలోని ప్రాంతాలనే పరిశుభ్రం చేయడమే కాకుండా ఇతర జిల్లాల్లో ఆపదలో ఉన్న వారికి సేవలు అందించడం అభినందనీయమన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత

విశాఖ విద్య: అనాథ శవానికి జీవీఎంసీ బుచ్చిరాజుపాలెం షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్నెల్ల కిందట శ్రీనివాసరావు అనే వ్యక్తికి షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. అప్పటి నుంచి షెల్టర్‌లోనే ఆశ్రయం పొందుతున్నాడు. కాగా 8వ తేదీన శ్రీనివాస్‌కి ఆరోగ్యం బాగోలేక పోవడంతో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్పించారు. శ్రీనివాస్ చికిత్స పొందుతూ 9వ తేదీన మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో మేనేజర్ ఎల్లెటి మమత ఎయిర్ పోర్ట్ పోలీసుల సమక్షంలో అనాథశవానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్ తీరుపై ప్రయాణికుల అసహనం

బస్సు నిలిపి టీ తాగడంతో నిలదీత



బస్సు పక్కకు నిలిపి టీ సేవిస్తున్న డ్రైవర్

మల్కాపురం/సింధియా: ఓ ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్వాకంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కొద్ది క్షణాల్లో గమ్య స్థానాలకు చేరుకునే సమయంలో డ్రైవర్ ఇలా వ్యవహరించడంపై వారు అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఇదీ పరిస్థితి

సింహాచలం డిపో నుంచి 55 సర్వీస్ నిత్యం సింహాచలం టూ సింధియా రాకపోకలు సాగిస్తుంది. దీనిలో భాగంగా మంగళవారం సాయంత్రం సింహాచలం నుంచి కొంత మంది ప్రయాణికులతో బస్సు మల్కాపురం మీదుగా సింధియా వస్తోంది. ఈ క్రమంలో మల్కాపురం వద్ద డ్రైవర్ బస్సు నిలిపి టీ తాగేందుకు దిగాడు. వాస్తవానికి ప్రయాణికులను గమ్యస్థానానికి చేరవేసిన తర్వాత విశ్రాంతి సమయంలో టీ తాగేందుకు దిగాల్సి ఉంటుంది. అలా కాకుండా మరో కొద్ది నిమిషాల్లో సింధియాకు చేరుకుంటున్న సమయంలో మల్కాపురం వద్ద అకస్మాత్తుగా బస్సు నిలిపి కబుర్లు చెప్పుకుంటూ టీ తాగడంతో బస్సులో ఉన్న ప్రయాణికులు,ఇద్దరు విద్యార్థులు, ఓ దివ్యాంగురాలు డ్రైవర్‌ను ప్రశ్నించారు.టీ తాగేందుకు ఇదా సమయం అని నిలదీసినా డ్రైవర్ స్పందించకపోవడంతో ఇద్దరు విద్యార్థులు బస్సు దిగి ఆటోలో సింధియా వైపు వెళ్లిపోయారు. దీనిపై బస్సులో ఉన్న దివ్యాంగురాలు గట్టిగా ప్రశ్నించడంతో పెద్ద సమస్య అవుతుందనుకున్నాడో ఏమో గానీ డ్రైవర్ వెంటనే బస్సు ఎక్కి సింధియా వైపు ప్రయాణం సాగించాడు. కాగా డ్రైవర్ తీరుపై అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు దివ్యాంగురాలితో పాటు ప్రయాణికులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర కుంకుమార్చన



స్వామివారిని దర్శించుకున్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పరిసర కాలనీల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

పారిశుధ్య సిబ్బందికి వస్త్రాల అందజేత



పారిశుధ్య సిబ్బంది నూతన వస్త్రాలను అందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: విజయవాడలో ఇటీవల సంభవించిన వరదల సమయంలో వార్డు నుంచి వెళ్లి విశేష సేవలందించిన పారిశుధ్య సిబ్బందికి 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు మంగళవారం నూతన వస్త్రాలు అందజేశారు. ఏకేసీకాలనీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు తమ ఆరోగ్యాలను లెక్క చేయకుండా పని చేస్తున్న పారిశుధ్య సిబ్బంది సేవలను ఎంత కీర్తించినా తక్కువేనన్నారు. విజయవాడ ప్రజల జీవన స్థితిగతులు సాధారణ స్థితికి తీసుకుని రావడానికి విశాఖ నుంచి వెళ్లిన పారిశుధ్య సిబ్బంది ఎంతో శ్రమించారని కొనియాడారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సచివాలయ శానిటరీ సెక్రటరీ సత్తిబాబు, సూపర్‌వైజర్ శ్రీను, కొండబాబు పాల్గొన్నారు.

63వ వార్డులో..

63వ వార్డులో పారిశుధ్య సిబ్బందికి వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు గల్లా చిన్నా మహిళలకు రెండు చీరలు, పురుషులకు రెండు జతల చొప్పున దుస్తులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు గూడెల కృష్ణ, ధర్మ, రాకీ, నారాయణరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఏకాదశి పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి, పూజల్లో పాల్గొన్న భక్తులు

మల్కాపురం: కార్తీక మాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువుదీరిన శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ఆలయ అర్చకులు పలు నదుల నుంచి సేకరించిన జలాలతో అభిషేకించారు. అనంతరం తులసి,సుగంధ పుష్పాలను అలంకరించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు ఏకాదశి విశిష్టతను వివరించారు. పలువురు భక్తులు గోవింద నామాలను పఠించారు.అలాగే ప్రకాష్‌నగర్,శ్రీహరిపురం,ములగాడ హౌసింగ్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఆయా ఆలయాల అర్చకులు ప్రసాదాలు అందించారు.

నాణ్యమైన సరకులు విక్రయించాలి

మార్కెటింగ్ అధికారి యాసిన్



రైతు గుర్తింపు కార్డును తనిఖీ చేస్తున్న మార్కెటింగ్ అధికారి యాసిన్

విశాఖ విద్య: వినియోగదారులకు నాణ్యమైన సరకులు, కూరగాయలు విక్రయించాలని వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి యాసిన్ సూచించారు. జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని మర్రిపాలెం రైతు బజార్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. బజార్‌లోని ఉల్లిపాయలు, టమాటా విక్రయాలు జరుపుతున్న స్టాల్స్‌ను పరిశీలించారు. నాణ్యమైన టమాటా, ఉల్లిపాయలను అందించాలన్నారు. అనంతరం ఆయన కూరగాయల దుకాణాల వద్ద కు వెళ్లి రైతులతో మాట్లాడారు. కూరగాయల నాణ్యత విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రావడానికి వీల్లేదన్నారు. రైతు బజార్‌లో దుకాణదారులకు సంబంధించిన గుర్తింపు కార్డులు, అదే విధంగా రోజు వారీ విక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈవో కొమ్మనాపల్లి వరహాలు, సహాయకుడు ప్రతాప్ పాల్గొన్నారు.


మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



రాజేష్‌కుమార్ (ఫైల్)

విశాఖవిద్య: కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎయిర్ పోర్ట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తెలిపిన వివరాలు.. న్యూ కరాసా సాయిబాబా వీధి గాంధీ బొమ్మ సమీపంలో మూనూరు రాజేష్ కుమార్(35), భార్య మేరీ కుమారితో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. నగరంలోని ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ కోచ్‌గా పని చేస్తున్నాడు. నాలుగు రోజుల కిందట భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి రాజేష్ కుమార్ ఒంటరిగానే ఉంటున్నాడు. రెండు రోజులుగా కోచ్ రాకపోయేసరికి ఓ విద్యార్థి, అతని తండ్రి రాజేష్‌కుమార్ ఇంటికి మంగళవారం వెళ్లారు. పిలిచినా పలక లేదు. తలుపులు తీసి ఉండడంతో సదరు విద్యార్థి లోపలకు వెళ్లే సరికి కోచ్ రాజేష్‌కుమార్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో విషయం తండ్రికి తెలిపాడు. దీనిపై వెంటనే పై అంతస్తులో ఉంటున్న ఇంటి ఓనర్‌కు తెలిపారు. ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ చేరుకుని పరిశీలించి వివరాలను సేకరించారు. మృతుడికి వివాహమై 13 సంవత్సరాలు కాగా పిల్లలు లేరు. ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ తరలించారు. మృతుడి తల్లి నూకాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కడుపు నొప్పి తాళలేక విద్యార్థి..



నిఖిల్ (ఫైల్)

విశాఖ విద్య: గోపాలపట్నం మండలం యల్లపువానిపాలెంలో నిఖిల్ అనే పదో తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. తల్లి కుమారి ఎయిర్‌పోర్టులో డైలీవేజ్ వర్కర్‌గా పనిచేస్తుంది. ఆమె రోజు వారీ విధులకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిఖిల్ ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తోటి విద్యార్థులు నిఖిల్ ఇంటికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. విషయాన్ని సమీప ఇళ్లకు వారికి చెప్పడంతో వారు తల్లి కుమారికి సమాచారం ఇచ్చారు. ఆమె కుమారుడి మృతదేహాన్ని చూసి బోరును విలపించింది. కుమారుడికి తరచూ కడుపునొప్పి వస్తుందని.. భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్టు కుమారి ఫిర్యాదులో పేర్కొంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గోపాలపట్నం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.